## క్లుప్తంగా

### ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


డాక్టర్ తలే రాజేష్

బొబ్బిలి/రాజాం: బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల ప్రజలకు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ ఈ దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజల మనోభీష్టాలు నెరవేరాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు సంతోషంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు.

### ఈ-క్రాప్ నమోదు పరిశీలన


కొప్పరవలసలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని ఏఓ తట్టికోట కన్నబాబు సచివాలయ వీఏఏలకు సూచించారు. మండలంలోని కొప్పరవలస, బంగారువలస గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి వీఏఏలు చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని 29 పంచాయితీల్లో 16 వేల ఎకరాల్లో పంటల నమోదు చేపట్టాల్సి ఉందని, ఇప్పటి వరకు 9,500 ఎకరాల్లో పంటల వివరాలు నమోదు పూర్తయిందని చెప్పారు. ఈనెల 25లోగా శత శాతం పూర్తి చేయనున్నామని తెలిపారు.

### తబలా కళాకారుడి కుటుంబానికి సాయం


బాలకృష్ణ భార్య కొండమ్మకు నగదు అందజేస్తున్న చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం ప్రతినిధులు

రాజాం: బొద్దాం గ్రామానికి చెందిన తబలా కళాకారుడు బొద్దాం బాలకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం రూ. 25వేల ఆర్థిక సహాయం అందజేసింది. చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం అధ్యక్షుడు ఏ.లింగమూర్తి, ఉత్తరాంధ్ర కళా పరిషత్ కార్యదర్శి మారుతీ ప్రసాద్, పలువురు కళాకారులు ఆదివారం బొద్దాం గ్రామానికి వెళ్లి మృతుడి భార్య కొండమ్మకు నగదు అందజేశారు. కె.ఎస్.ఎన్. ఆచారి, ఉప్పాడ అప్పారావు, కిట్టలపాడు శ్రీను, సత్యం మాస్టర్, రవి, ఎం.రామారావు, జనార్ధనరావు, దాలయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

### రగ్గులు, బెడ్‌షీట్ల పంపిణీ


విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఏబీసీడబ్ల్యూఓ శ్యామలాకుమారి

బొబ్బిలిరూరల్: మండలంలోని కలవరాయి బీసీ బాలుర వసతి గృహంలో 164 మంది విద్యార్థులకు శనివారం రాత్రి బీసీ సంక్షేమశాఖాధికారి(ఏబీసీడబ్ల్యూఓ) ఏ.శ్యామలా కుమారి రగ్గులు, బెడ్ షీట్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, వసతి గృహంలో సౌకర్యాలు, ఇతర అంశాలపై ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ శ్రీనివాస రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి


బాణసంచా దుకాణాల వద్ద సిబ్బందికి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఎస్ఐ అశోక్

రాజాం సిటీ: తాత్కాలిక బాణసంచా దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజాం అగ్నిమాపక శాఖ ఎస్ఐ పైల అశోక్ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను ఆదివారం ఆయన సందర్శించారు. దుకాణాల వద్ద డ్రమ్ములతో నీరు, ఇసుక, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. దుకాణాల దగ్గర్లో ఎవరూ పొగతాగకుండా చూడాలని నిర్వాహకులకు చెప్పారు. ప్రమాదాలు సంభవించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట అగ్నిమాపక శాఖ ఏఎస్ఐ వై.గోవిందరావు, సిబ్బంది ఉన్నారు.

# వేగావతిలో ఇసుక తోడేళ్లు

- వేగావతి నది నుంచి యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా
- తెల్లవారు ఝాము నుంచి అర్ధరాత్రి వరకు తవ్వకాలు
- సొమ్ము చేసుకుంటున్న కూటమి నాయకులు


అలజంగి వద్ద వేగావతి నదిలో ట్రాక్టర్లకు ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

బొబ్బిలిరూరల్: మండల పరిధిలోని వేగావతి నదిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. కారాడ, అలజంగి,పెంట,పారాది గ్రామాల వద్ద వేగావతి నదిలో తెల్లవారు ఝాము నుంచి అర్ధరాత్రి వరకు ఇసుక దందా అడ్డూ అదుపు లేకుండా సాఫీగా సాగుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తవ్వి బొబ్బిలి పట్టణంలో నిర్మాణాలకు, గ్రోత్ సెంటర్‌లో కొన్ని పరిశ్రమల నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.ట్రాక్టర్ లోడ్ ఇసుక సుమారు మూడు వేల రూపాయల వరకు విక్రయిస్తూ అక్రమార్కులు కాసులు వెనుకేసుకుంటున్నారు. రెవెన్యూ విలేజ్ పరిధి దాటి ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతులు లేకపోయినా టీడీపీ కూటమి నాయకులు అధికారంలో ఉన్నామన్న అండతో రెచ్చిపోతున్నారు. వేగావతి నదిని గుల్ల చేస్తూ కాసులు దండుకుంటున్నారు.నిఘాపెట్టి నియంత్రించాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారు అధికార పార్టీ నాయకులే అని తెలిసి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

#### పారాదిలోనే అధిక తవ్వకాలు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఇటీవల పత్రికల్లో వస్తున్న కథనాలకు స్పందించిన రెవెన్యూ అధికారులు అలజంగి,పెంట గ్రామాల వద్ద ట్రాక్టర్లను పట్టుకుని యజమానులను హెచ్చరించారు.దీంతో ఒకటి రెండు రోజులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నిలిపివేశారు. ఆతర్వాత మళ్లీ యథాతథంగా వారి దందా ప్రారంభించారు.పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు,తరలింపు జరుగుతోంది. తెల్లవారు ఝాము నుంచే తవ్వకాలు, తరలింపులు ప్రారంభమై తొమ్మిదింటికి నిలిపి వేసి, మళ్లీ సాయంత్రం అయిదు గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.


ఇసుక తవ్వకాలతో అలజంగి వద్ద పక్కకు ఒరిగిపోయిన ఇన్‌ఫిల్టర్ బావి


పారాది నుంచి గ్రోత్ సెంటర్‌లోని ఫెర్రోపరిశ్రమలకు తరలిపోతున్న ఇసుక

#### ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలకు సరఫరా..!

పట్టణంలోని గ్రోత్‌సెంటర్‌లోని ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలకు అసవరమైన ఇసుకను కూటమి నాయకులు అనధికార కాంట్రాక్ట్ తీసుకుని టన్నుల కొద్దీ సరఫరా చేస్తున్నారు. పారాది, గొర్లె సీతారాంపురం సమీపంలోని వేగావతి నదినుంచి ఇసుకను సేకరించి గ్రోత్‌సెంటర్‌కు తరలిస్తున్నారు.గ్రోత్‌సెంటర్‌లో ఇసుక నిల్వపాయింట్ ఉన్నప్పటికీ అక్కడి నుంచి గత ఏడాదిగా కనీసం టన్ను ఇసుక కూడా ఆయా ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో లేకపోవడం విశేషం.

#### ఒరిగిపోతున్న ఇన్‌ఫిల్టర్ బావులు

వేగావతి నది నుంచి గ్రామాలకు తాగు నీరు సరఫరా చేసే ఇన్ ఫిల్టర్ బావుల చుట్టూ కూడా లోతుగా ఇసుక తవ్వేస్తుండడంతో అవి పక్కకు ఒరిగిపోతున్నాయి. మరి కొద్దిరోజులు ఇలాగే తవ్వకాలు కొనసాగితే ఇన్‌ఫిల్టర్ బావులు పూర్తిగా కూలిపోయే ప్రమాద ముందని, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని నదీతీర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అలాగే ట్రాక్టర్లతో ఇసుక తరలింపుల వల్ల ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులు ఛిద్రమవుతున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ గోతులు తేలుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని ఆయా గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

## సోషల్ మీడియా మరింత పటిష్టంగా పనిచేయాలి


డాక్టర్ రాజేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు

రాజాం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మరింత పటిష్టంగా పనిచేయాలని ఆ పార్టీ రాజాం నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులైన కోట గణేష్, బెండు వెంకటరావు, అదపాక గణపతినాయుడు, కంట జగదీష్ చంద్రప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో తలే రాజేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వీరిని రాజేష్ అభినందించడంతో పాటు నియోజకవర్గానికి చెందిన నలుగురుకి జిల్లా విభాగంలో అవకాశం రావడంపై పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ సోషల్ మీడియా బలంగా పనిచేస్తోందని అన్నారు. ఈ బలమైన సర్కిల్‌ను ఛిదిమేసేందుకు కూటమి ప్రభుత్వం కేసులు పెడుతున్నా తట్టుకుని సోషల్ మీడియా కార్యకర్తలు నిలబడ్డారని, భవిష్యత్‌లో వీరికి పార్టీ తరఫున మంచి ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులైన సోషల్ మీడియా కార్యకర్తలు ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

## మొక్కలతోనే కాలుష్య నివారణ సాధ్యం


మొక్కలు నాటుతున్న కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు

రాజాం సిటీ: వాతావరణంలో పెరుగుతున్న కాలుష్య నివారణ మొక్కల పెంపకంతోనే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు.స్థానిక బొబ్బిలి రోడ్డులోని డివైడర్‌లలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, గోకవలస కృష్ణమూర్తి, రెడ్డి శ్రీనివాసరావు, రవి, సీమకుర్తి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ సొత్తు కొనడం నేరం


మాట్లాడుతున్న సీఐ కె నారాయణరావు

రామభద్రపురం: బంగారం, మొబైల్‌ఫోన్‌లు, తదితర చోరీ సొత్తును తెలిసి కొనుగోలు చేసినా, తెలియక కొనుగోలు చేసినా తిరిగి వెనక్కి ఇవ్వాల్సిందేనని సీఐ కె.నారాయణరావు అన్నారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చోరీసొత్తు కొనడం నేరమని, ఈ విషయం తెలియక కొనుగోలు చేస్తే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. దుకాణాల్లో కాకుండా కొంతమంది వ్యక్తులు ఖరీదైన మొబైల్ ఫోన్‌లను తక్కువ ధరకు అమ్మజూపుతారని, వాటిని కొందరు ఇట్టే కొనుగోలు చేస్తుంటారని చెప్పారు. ఇంతకీ ఆ మొబైల్ ఫోన్‌లు ఎక్కడి నుంచి తీసుకొచ్చారో,ఎందుకు విక్రయిస్తున్నారో విషయాలు తెలుసుకోకుండా కొనుగోలు చేయకూడదన్నారు. విక్రయించేవాడు కూడా నమ్మించేలా వ్యవహరించి నగదు తీసుకుని జారు కుంటాడని, అక్కడి నుంచి కొనుగోలుదారులు ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు.మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు ఫిర్యాదు చేస్తే అది ఎక్కడ ఉందో కనిపెట్టి బాధితులకు అప్పగిస్తామన్నారు.దుకాణాల వద్ద కాకుండా వ్యక్తుల వద్ద మొబైల్ ఫోన్‌లు కొనుగోలు చేసినప్పుడు దాని ఐఎంఈఐ నంబర్ ద్వారా దానిపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా?, పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం ఉందో తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ అందుబాటు లోకి వచ్చిందన్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో నమోదుతో సంబంధిత మొబైల్ వివరాలు వెల్లడవుతాయన్నారు. ఆ యాప్ ద్వారా వివరాలు తెలుసుకున్నాకే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

### ● ఇది రోడ్డే..!

ఈ చిత్రం చూసి ఇదేదో మారుమూల గిరిజన గ్రామానికి వెళ్లే కాలిబాట అనుకుంటే మీరు బురదలో కాలేసినట్టే!.ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బొబ్బిలిలోని సివిల్ సప్లయిస్ గోదాంకు వెళ్లే రోడ్డు. ఈమార్గం గుండానే చుట్టుపక్కల ఉన్న సుమారు 90 గ్రామాలకు రేషన్ సరుకులను తీసుకువెళ్తారు. కానీ ఇక్కడ రోడ్డు మాత్రం నిర్మించలేదు. గోదాం నిర్మాణం సమయంలో నిర్మించిన మట్టి రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు.

– బొబ్బిలి



## క్రీడాకారిణికి ప్రోత్సాహం


పూజితకు నగదు అందజేస్తున్న తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగంలో క్రికెట్ పోటీలకు ఎంపికైన మండలంలోని పొగిరి ఉన్నత పాఠశాల విద్యార్థిని అబోతుల పూజిత క్రికెట్‌లో రాణించేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని తూర్పుకాపు సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. విద్యార్థిని ప్రాక్టీస్‌కు అవసరమైన క్రికెట్ కిట్ కొనుగోలు చేసేందుకు రూ. 5వేలు సాయం చేశారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి, రాజాం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తూర్పుకాపు సంక్షేమ సంఘం సభ్యులు ఆర్.వి.జె.నాయుడు, డోల వాసుదేవరావు, మీసాల వెంకటేష్, పెంకి చైతన్య, ఎస్.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వారాల పండగ

బాడంగి: మండలంలోని రేజేరులో గ్రామ దేవత దుర్గమ్మతల్లి వారాల పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు.అమ్మవారి ప్రభతో ఊరేగింపుగా గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆయన నేత్రాలు సజీవం


కోట్ల నారాయణ రావు (ఫైల్)

రాజాం సిటీ: ఆయన మరణించినా ఆయని నేత్రాలు సజీవంగానే ఉన్నాయి. నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు ప్రసాదించనున్నాయి. రాజాం పట్టణంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న కోట్ల నారాయణరావు (60)కు శనివారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం తరలించగా అక్కడ మృతి చెందారు. అయితే శనివారమే ఆయన పుట్టిన రోజు కావడంతో సాయంత్రం ఎంతో సంతోషంతో వేడుక జరపాలని భావించారు. కానీ ఆయన గుండె పోటుతో మరణించారు. అంత దుఃఖంలోనూ ఆయన నేత్రాలు దానం చేసేందుకు భార్య అన్నపూర్ణ, కుమారుడు కోట్ల వరుణ్‌కుమార్, కుమార్తె అమృత నిశ్చయించుకున్నారు. రాజాం రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం అందించగా, రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ శ్రీకాకుళం రెడ్‌క్రాస్ కల్యాణ్‌మగటపతి నేత్రసేకరణ సిబ్బందికి విషయం చెప్పారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని నుంచి కార్నియా సేకరించారు.

### ఆయుర్వేద వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య కేంద్రం వద్ద వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యం ఆదివారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఉత్తమమైనదని, అనాది నుంచి ప్రాచుర్యంలో ఉందని వివరించారు. ఆయుర్వేద మందులతో సైడ్ ఎఫెక్స్ ఉండవని స్పష్టం చేశారు.

### బాణసంచా వ్యాపారం వర్షార్పణం

రాజాం: రాజాం పట్టణంలో ఆదివారం బాణసంచా వ్యాపారం వర్షార్పణమైంది. గాయత్రీ కాలనీ సమీపంలో ఏడు తాత్కాలిక బాణసంచా దుకాణాలను ఆదివారం , సోమవారం రెండురోజుల వ్యాపారం నిమిత్తం లైసెన్స్‌తో ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటనుంచి వర్షం ప్రారంభమవ్వడంతో వ్యాపారం మందగించింది. వర్షం వల్ల బాణసంచా కొనుగోలు చేసేందుకు పెద్దగా ఎవరూ రాలేదు. దుకాణాలన్నీ వెలవెలబోయాయి.

## ప్రభుత్వానికి కళాకారుల గోడు పట్టదా..?

- ఒక్కరికి కూడా కొత్తగా పింఛన్ ఇవ్వలేదు
- కళాకారులకు గుర్తింపే లేదు
- ఉత్తరాంధ్ర కళా పరిషత్ కార్యదర్శి మారుతీ ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మారుతీప్రసాద్, తదితరులు

రాజాం: రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకుని పాలన చేస్తోందని, కళాకారుల నుంచి పుట్టుకొచ్చిన పార్టీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నా కళాకారులకు సంక్షేమం అందడం లేదని ఉత్తరాంధ్ర కళా పరిషత్ కార్యదర్శి మారుతీ ప్రసాద్ మండిపడ్డారు. బొద్దాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సామాజిక పింఛన్లలో సాధారణ పింఛన్లకు వచ్చే నగదు కంటే రెట్టింపు నగదు కళాకారులకు పింఛన్ రూపంలో ప్రభుత్వాలు ఇచ్చేవని గుర్తుచేశారు. ఇప్పుడు అందరికీ సమానంగా పింఛన్ ఇస్తున్నారని, కళాకారులకు అదనంగా ఇవ్వకపోవడం గుర్తింపు లేకపోవడమేనని మండిపడ్డారు. ఎప్పుడో వైఎస్సార్ సమయంలో 5వేల మంది కళాకారులను పింఛన్ల నిమిత్తం గుర్తించారని, ఇంత వరకూ కొత్త కళాకారుడిని గుర్తించ లేదని మండిపడ్డారు. కళాకారులను గుర్తించక పోవడం, కళా రంగాన్ని ప్రోత్సహించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ ఒక భాగస్వామ్యమని, ఈ పార్టీని కళాకారుడైన ఎన్టీఆర్ స్థాపించారని, కళాకారుడికి చెందిన పార్టీ పాలనలో కళాకారులకు ఏమాత్రం మేలు చేకూరడం లేదని అన్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ కూడా కళాకారుడే కాగా, ఎన్టీఆర్ తనయుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా కళాకారుడేనని, పాలకవర్గంలో కళాకారులు ఉన్నా కళారంగానికి ప్రాధాన్యత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కళాకారులు ప్రస్తుతం ఏ పనిచేసుకోలేక, సరైన ఆదాయంలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పింఛన్ కోసం కొత్తగా కళాకారులను గుర్తించాలని, నెలవారీ పింఛన్‌ను రూ. 10 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు.

**రాజాం కళాక్షేత్రం సాకారం మాజీ ఎంపీ కృషే**

రాజాంలో ప్రారంభించిన జీఎంఆర్ కళాక్షేత్రం నిర్మాణం గొప్పతనం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు మాత్రమే దక్కుతుందని మారుతీ ప్రసాద్ అన్నారు. మూడేళ్ల క్రితం బెల్లాన ఎంతో శ్రమించి అక్కడ జీఎంఆర్‌తో మాట్లాడి స్థలం పునః కేటాయింపులు చేయడంతో పాటు రూ.10 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. రాజాంలో కళాక్షేత్ర భవననిర్మాణాలు జరగడం చాలా ఆనందకరమని తెలిపారు.చీమకుర్తి కళాపీఠం అధ్యక్షుడు ఏ.లింగమూర్తి , కళాకారులు కె.ఎస్.ఎన్.ఆచారి, ఉప్పాడ అప్పారావు, కిట్టలపాడు శ్రీను, సత్యం మాస్టర్, రవి, ఎం. రామారావు, జనార్ధనరావు, దాలయ్య, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

- మండల అధ్యక్షులుగా పాతవారే కొనసాగింపు

రాజాం: వైఎస్సార్‌సీపీ రాజాం మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని మండలాలకు నూతన కార్యవర్గాలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాజాం మున్సిపాలిటీ, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల కమిటీల వివరాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**రాజాం మున్సిపాలిటీ:**
రాజాం మున్సిపాలిటీకి సంబంధించి పార్టీ వైస్ ప్రెసిడెంట్‌లుగా దూబ గోపాలం, ముద్దన సత్యారావులు, ప్రధాన కార్యదర్శులుగా కాలెపు చంద్రశేఖర్, గార సత్యనారాయణ, కంబాల సుదర్శనరావు, పాలవలస మహేశ్వరరావు, కార్యదర్శులుగా కిలారి శ్రీనివాసరావు, బగ్గు హరనాథరావు, పిట్టా జగదీశ్వరరావు, టంకాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరు కాకుండా మరో 48 మంది సభ్యులు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా నియమితులు కాగా, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడిగా పాలవలస శ్రీనివాసరావు కొనసాగుతారని రాజేష్ వెల్లడించారు.

**రాజాం మండలం:**
రాజాం మండలానికి సంబంధించి పార్టీ వైస్ ప్రెసిడెంట్‌లుగా కోనారి అప్పారావు, బింగి సూర్యనారాయణలు, ప్రధాన కార్యదర్శులుగా ముదిలి జనార్ధనరావు, ఆల్తి రాంబాబు, కామోదుల శ్రీనివాసరావు, పొన్నాడ సన్యాసినాయుడు, కార్యదర్శులుగా దబ్బాడ వెంకటరమణ, కరణం తులసి నాయుడు, సీహెచ్. శ్రీనివాసరావు, మూడడ్ల తిరుపతిరావు, యడ్ల అప్పలరాజు నియమితులయ్యారు. వీరితో పాటు మరో 32 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నియమితులు కాగా, మండల పార్టీ ప్రెసిడెంట్‌గా లావేటి రాజగోపాలనాయుడు కొనసాగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**రేగిడి మండలం:**
రేగిడి మండలం నుంచి పార్టీ వైస్ ప్రెసిడెంట్‌లుగా కెంబూరి వెంకటేశ్వరరావు, గుంటు మోహనరావులు, ప్రధాన కార్యదర్శులుగా ముంజేటి కిశోర్‌కుమార్, వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, నెల్లి సుగుణాకరరావు, లావేటి గణపతిరావు, కార్యదర్శులుగా పేడాడ రామి నాయుడు, బంకి చంద్రశేఖర్‌రావు, చుక్క వెంకటినాయుడు, నక్క తిరుపతిరావు, వావిలపల్లి వెంకటరమణ నియమితులు కాగా, మరో 47మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు వెల్లడించా రు. పార్టీ మండల ప్రెసిడెంట్‌గా వావిలపల్లి జగన్‌మోహనరావు కొనసాగుతున్నారు.

**సంతకవిటి మండలం:**
సంతకవిటి మండలానికి సంబంధించిన పార్టీ వైస్ ప్రెసిడెంట్‌లుగా గంటా షణ్ముఖరావు, నూనుగొప్పల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా వావిలపల్లి శ్రీనివాసనాయుడు, పప్పల గణపతిరావు, గుర్ల జగన్‌మోహనరావు, దవళ నర్సింహమూర్తి, కార్యద ర్శులుగా యడ్ల రామకృష్ణ, రెడ్డి స్వామినాయుడు, ఇనుమల జనార్ధనరావు, ఎన్ని శ్రీనివాసరావు, తమ్మినేని వెంకటరమణ నియమితులు కాగా, మరో 48 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారని ఆపార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు తెలిపారు. పార్టీ మండల ప్రెసిడెంట్‌గా గురుగుబెల్లి స్వామినాయుడు కొనసాగుతున్నారు.

**వంగర మండలం:**
వంగర మండలానికి సంబంధించి వైస్ ప్రెసిడెంట్‌లుగా యలకల శ్రీనివాసరావు, బొంతు వెంకటరావు, ప్రధాన కార్యదర్శులుగా ద్వారపురెడ్డి సింహాచలం, చింతగుంటి రామారావు, పున్నాన జనార్ధనరావు, పోలిరెడ్డి రమేష్, కార్యదర్శులుగా టెంగు జోగినాయుడు, గంటా రామ్‌మోహన్‌రావు, చప్పా శ్రీనివాసరావు, కర్రి నారాయణరావు నియమితులు కాగా, మరో 23 మంది ఎగ్జిక్యూటి వ్ మెంబర్లుగా నియమితులైనట్లు ఆ పార్టీకి చెందిన వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. పార్టీ మండల ప్రెసిడెంట్‌గా కరణం సుదర్శనరావు కొనసాగుతున్నారు.